# మాయిల్లు మ్యూజియం నేనుమృగాన్ని!

శ్రీ అనుముల వెంకటశేషకవి

## 1

మాయిల్లు మ్యూజియం - నేను మృగాన్ని! - మా యింట్లో మాంసం తిని జీర్ణించుకోగల పెద్దపులివంటి క్రూరమృగాలూ ఉన్నాయి. తృణభక్షణతో తృప్తిపడేగోవులూ ఉన్నాయి. అటూయిటూ చేరని నక్కలూ, కండ్లు మూసుకొని పాలు త్రాగే పిల్లులూ, కోపమొచ్చి కఱచే కుక్కలూ, యేదో విసంగా సంసార మీదే చేపలూ, అన్నిటికీ ప్రతులు వేసే చిలుకలూ, అసూయతోనే జీవించే గుడ్లగూబలూ - వీటికి లెక్కలేదు. పట్టుమని విస్తళ్లు వేసేవేళకు పిల్లా మేకా కలిసి, కనీసం ముప్పైమందైనా తయారు. పైగా వచ్చేవాళ్ళకూ, పొయ్యేవాళ్ళకూ అది మజిలీ.

ఇంతకూ నే నే జాతి మృగాన్నో చెప్పలేను. అసలు మృగాన్నో, కానో కూడా సందేహమే! - మృగాన్ని కాకుంటే ఆ మ్యూజియంలో యెందుకుంటాను? ఐతే, కొందఱు మానవులతో యెందుకు కలిసి మెలసి తిరుగుతాను? - వాళ్ళంతా మానవులైతే నేనూ ఔతాను. కాక, మృగాలే ఐతే, నాకూ తప్పదుగా? ఊళ్ళోనూ మానవులే లేరా? ఏమో? ఎవరికి తెలుసు? ఆనాడు నాకున్న విజ్ఞానాన్నిబట్టి, ఆ సంగతి నిర్ణయించడం అసాధ్యమేమో? నేను మృగాన్నే కావలసివస్తే కొదమ మృగాన్ని మాత్రమే. నా వయసు పదుమూడేండ్లు.

నా తొమ్మిదోయేటనే మా అమ్మ పోయింది. - "పోయిందని చప్పగా చెప్పడమేమిటి? నీ మొహం! - స్వర్గస్థురాలయిందనో, వైకుంఠయాత్ర వెళ్ళిందనో, కైలాసాని కేగిరిందనో, కాస్త గంభీరంగా అనూ! ఆదికవుల సాంప్రదాయాన్ని అనుసరించు! శిష్ట వ్యవహారాన్ని చంపకు!" - అని మీరు మాత్రం ఆగ్రహించరాదు. ఏమంటే? - నా మతంలో స్వర్గ వైకుంఠ కైలాసాలూ, నరక, పాతాళాది నానా జగత్తులూ వట్టి బూటకాలు. అవే నిజమైతే, నేనూ ఒక నాగకన్యనో, దేవకన్యనో వరించి తెచ్చి, హాయిగా కాలక్షేపం చేయలేకపోదునా?

బాల్యం లగాయతూ, నావన్నీ విపరీతమైన ఊహలు. అందఱూ ఔనన్నదాన్ని కాదనడం, కాదన్నదాన్ని ఔననడం నాకు మామూలు. అందువల్ల -యెందుకైనా నా అభిప్రాయాన్ని అడిగేవాళ్లు బుద్ధిహీనులు. ఈ సంగతి నా స్నేహితులంతా తెలుసుకున్నారు. ఒకసారి నేనే కాదన్నదాన్ని, ఔనని సమర్థించడం - ఔనన్నదాన్ని కాదని తిరస్కరించడం - నా కలవాటే. ఇందలి యథార్థం యీ కథ చదివితే మీరూ గ్రహిస్తారు.

మొదలు మొదలు సన్యాసం మంచిదనీ, ఆదర్శప్రాయమనీ నమ్మి, దాన్నిగూర్చి ఉపన్యాసాలు దంచేవాణ్ణి. విన్నవాళ్లు డంగైపోయి, డొంకతిరిగి డింకమాను కొడుతూంటే - నేనింకా వాళ్ల నేడిపించడానికి, కాషాయపురంగు చొక్కాలు తయారు చేయించి, శివిగా ధరించి, తిరిగేవాణ్ణి. ఇది చూచి నిజంగా నేను సన్యాసినే ఔతానని మావాళ్ళంతా భయపడసాగినారు.

అంతకంతకూ పిచ్చి ముదురుతూండనుకొనే దశలో, నేను హఠాత్తుగా మారినాను. పెండ్లి చేసుకున్నా, లేకున్నా సరేగాని, సన్యాసం వద్దని తీర్మానించుకున్నాను. హాయిగా ధవళాంబరాలు ధరించక, యీ కాషాయాంబరాలేమిటి, నా కర్మం?-మఱి కొన్నాళ్లకు, సన్యాసం మంచిదీ కాదు; ఆదర్శమూ కాదని వాదించినాను. 'ఈ మార్పేమిటిరా?'-అని మిత్రులంతా దిగ్భ్రాంతులైనారు. ఏది వచ్చినా మంచికేనంటూ, మా బంధువులు మాత్రం తృప్తిపడసాగినారు.

ఐతే, వాళ్లనుకున్నదానికీ, నా అభిప్రాయానికీ భేదం. "మనవాడు మార్గంలో పడినాడు; పెండ్లీ పేరంటం చేసుకుంటాడు. మనమాట వింటా"డని వాళ్లూ. "వివాహం జోలికి పోకుండానే విశ్వానికి సేవచేస్తూ, స్వార్థత్యాగినై ఒక పంథాలో నాయకత్వం వహించవచ్చు"నని నేనూ. పరిణయానికీ ప్రపంచోపకారానికీ పరస్పర విరోధమంటూ ప్రచారం చేయగాచేయగా, మళ్లీ మావాళ్లు మూతులు ముడిచినారు. పరులు నవ్వినారు. నాకుమాత్రం నమ్మకం తగ్గలేదు. నా పేరు విశ్వోద్ధారకుల పట్టిలో అగ్రస్థానాన్ని ఆక్రమించి, అన్ని పత్రికల్లో పడుతుందని సంతోషిస్తున్నాను. తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడని కలలోనూ అనుకోలేదు.

ఈ విధంగా కాలం జరిగిపోతుంటే, ఉన్నట్టుండి మా యింటికో భేతాళుడు వచ్చినాడు. తాటిచెట్టంత పొడుగూ, తగినంత లావూ, పెద్ద బొజ్జా, వెకిలినవ్వూ, వేళాకోళానికి కోపమూ, విపరీతపు సాధింపూ-ఇవీ అతని వీరోచితలక్షణాలు. భేతాళుడంటే, భేతాళుడే!- అడగడమెందుకూ?-వచ్చీ రావడంతోనే పెండ్లి పెత్తనాలు ప్రారంభించినాడు. ఎదిగిన పిల్లలిద్దఱకూ ఒకేముహూర్తంలో ముళ్లు పెట్టిస్తానన్నాడు. ఎవరు కాదంటారు? ఎక్కువ రోజులుంటే తిండి దండుగని మావాళ్లు మొదటనే ఒప్పుకున్నారు. అందులో ఒక పిల్ల నావంతని నిర్ణయించినారు. నన్ను మాత్రం పలకరించిన పాపాన పోలేదు. నాకేమీ తోచనూలేదు. అతడు వెళ్లిపోగానే, యెవరివల్లనో, జరుగబొయ్యే సంగతి తెలుసుకున్నాను. నాకీ వివాహం వద్దని గొణుక్కున్నాను. నా గొణుగు డెవరు వింటారు? నా దుఃఖమెవరు తీరుస్తారు? అసలు నే నంటే లక్ష్యమెవరికుంది?-ఇంకో భయం కూడా నాలో కలిగింది. "ఎదిగిన పిల్లలన్నాడు; ఇతడో భేతాళుడు!-అదే తాటకో, శూర్పణఖో ఐతే నాగతి?-దేవుడే దిక్కు!- అనడమేగాని ఆ దేవుడికైనా నమ్మితేనా?"—

నేను కృశించిపోసాగినాను. ప్రాణంతో ఉంటే చాలు!-పరిణయంచేసి తీరడానికి మావాళ్లు తీర్మానించినారు. నా పిడివాదాలూ, యతిమతాలూ, ఆదర్శాలూ, అవకతవకలూ-అన్నీ బుగ్గిలో కలిసినాయి. మా మేనత్త నన్నెగతాళిచేస్తూ, "ఏ పిల్లను చేసుకుంటావురా? పెద్దపిల్లనా? చిన్నపిల్లనా?" అని అడిగింది. "పెద్ద భూతమా? చిన్న భూతమా?-అంటే బాగుండేదేమో, కదా?"-అనుకున్నాను. "ఏదైతే నేం-ప్రాణం పోవడానికి?" అన్నాను. "ఛీ!

అపశకునపు పక్షీ!-అమ్మా ఏమిటిరా?"- అంటూ ఆమె లేచిపోయింది.

## 2

ముహూర్తం సమీపించింది. ఈ ఊరినుంచి మేమూ, యింకో ఊరినుంచి యితరులూ-యిరువాగులూ వచ్చి ఆ శ్వేతాశ్వపురంలో భేటీఅయినాము. రెండు జట్లూ మగపెళ్లివాళ్లమే కాబట్టి, మాకంతా ఒకటే విడిది. శ్వేతాశ్వపురం పల్లెటూరు. అపవుల్లో కొండల్లో ప్రయాణంచేసి అలసిపోయినాము. సెములికంట నీరుకారితే వేటగానికి ముద్దా! ఎదురుకోళ్లు తప్పవన్నారు. నా పోస్తకే నవసిపోతున్నాడా, లేదా, నా సడ్డకుడని-అతనివంక చూచినాను. ఏమీ లేదు. ఎప్పుడెప్పుడా అన్నట్టుగా ఉన్నాడు!- నా ఆశ్చర్యానికి పారం లేకపోయింది. నేను 'మృగాన్ని' అన్నమాట జ్ఞాపకమొచ్చి, నాకూ అతనికీ ఉన్న భేదం సహజమే కదా?-అనుకున్నాను. నా పశుత్వం నాకే తప్ప, యితరులకు తెలేదు కాబట్టి, మనుషులతోపాటు మర్యాదలు జరుగుతున్నాయి.

శ్వేతాశ్వపురంలో మగవాళ్ళంతా శ్వేతాశ్వులే!-ఒక్కటే అచ్చు!-ఆడవాళ్ళంతా అందుకు విరుద్ధం. వాళ్ళంత పొడుగో వీళ్ళంతపొట్టి వాళ్ళం. భీకరులో వీళ్ళంత భీరువులు; వాళ్ళంత మోటో, వీళ్ళంత మృదువు;-కాని, పెడసరంలో మాత్రం యెవ్వరి కెవ్వరూ తీసిపోరు.

మరునాడు పెండ్లిపీటలమీద కూర్చుంటే, నా కండ్లను నేనే నమ్మలేకపోయినాను. నా ఉద్వేగమూ, భీతీ, ఉత్సుకమూ-అంతా వట్టి అవివేకంగా తోచింది. ఎడమప్రక్కను కూర్చున్న పెండ్లికూతు రెనిమిదేండ్లదే. వజ్రపుతునకవలె, ప్రథమసంధ్యారాగ సమయంలోని యింద్రధనుస్సువలె, మఱుమిట్లు గొలిపింది-"ఇంతకంటే దేవకన్యకా?-ఎక్కడుంది? పో"మ్మనుకున్నాను. ఎదిగిన పిల్లల నేమాట కిప్పు డర్థం తెలిసింది. 'అష్టవర్షా భవేత్ కన్యా'-అనే శాస్త్రోక్తి అందుకు ప్రమాణం. తుదకు నా రొట్టె విఱిగి నేతిలోనే పడింది. నా తపస్సు-(ఎన్నడూ చేయకున్నా)-ఫలించింది.

ఒక్కసారిగా శ్వేతాశ్వపుర మనుకున్నది ఆనందపుర మయింది. నా దృష్టి మారింది. నా జీవితయాత్ర కది శుభశకునంగా పరిణమించింది. పెండ్లంటే యెంతో మధుర మనిపించింది. పీటలమీద కూర్చున్న మా యిద్దఱినీ చూచి, చిలుకా గోరువంకలని ఊరు ఊరు ప్రశంసించింది. నా చూపు మెల్లగా కుడిప్రక్కకు ప్రసరించింది. ఇటూ అటూ యిద్దఱు పెండ్లికూతుండ్లు!- నేను నడుమ ఉన్నాను. ఆ ప్రక్కను నా సడ్డకుడున్నాడు. నా అదృష్ట మతనికి పట్టకపోయింది గదా అనే గర్వం నన్నావేశించింది. అతనికీ విషయమై దుగ్ధ లేకపోయిందా!- ఏమో? సంశయింపవలసిన సంగతే?-

నేను మా వదినెనూ, భార్యనూ పోల్చి చూచుకున్నాను. ఎక్కడా పోలికలు లేవు! ఆమె పొడుగూ, యిది పొట్టీ, ఆమె మొహం కోలా, దీని మొహం గుండ్రనూ; ఆమె బక్కపలచనా, యిది కొత్త దుబ్బూ;- ఈ తారతమ్యమంతా ఒక్కమాటలో చెప్పవలెనంటే, ఆమె నాగకన్యకా; - ఇది దేవకన్యకా ఇద్దఱూ అందగత్తెలే!

పల్లెలలో పడుచుముత్తైదువులు పాటలకు పెట్టింది పేరు. పాటలాధరలనే మాటకు పాటలు పాడే పెదవులని అర్థం చెప్పుకుంటే బాగుంటుందేమో?-అప్పుడు సమాసం చెడుతుందని పండితు లాక్షేపించకుంటే స్త్రీ పర్యాయపదా లన్నిటికీ చిత్రమైన అర్థాలు దొరుకుతాయి. పండితులకూ మనకూ ఉన్న భేదమే యిదీ; వాళ్లు రసం చూడరు; మనం వ్యాకరణం చూడము. వాళ్లు వ్యాకరణమంటే, మనం గోకర్ణమంటాము. వాళ్లు సమాసం తప్పంటే, మనం సారస్యంగా ఉందని సంతోషిస్తాము. తొలిరాత్రి ప్రణయంలో వస్త్రమూల్యం విచారించే పద్ధతి మనదికాదు. ఎప్పుడైనా సమయం చిక్కించుకొని, యీ విషయంలో విపులమైన విమర్శ వ్రాయదలచుకున్నాను లెండి!

"ఈ దంపతులను సీతారాములు చిరంజీవుల చేయనీ! ఉమామహేశ్వరు లున్నతికి తేనీ! అరుంధతీ వశిష్ఠు లపేక్షలు హెచ్చించనీ!"- అంటూ మా అత్తగారు కొన్ని పాటలు పాడి, మంగళహారతు లెత్తుతుంటే, నే నీలోకాన్నే మఱచినాను. బువ్వంబంతిలో యిద్దఱు పెండ్లికూతుళ్లకూ యెంగిళ్లు చేసి, విస్తళ్ళు నింపినాను. ఇంకా పైత్యం తల కెక్కకొద్దీ, యెన్నో హాస్యాలు వర్షించినాను. ఈవిధంగా వివాహం జరిగిన అయిదు రోజులూ అఖండోత్సాహం ప్రదర్శించినాను.

నేనూ, నా సడ్డకుడూ, పరస్పర పరిచయం చేసుకున్నాము. అతడూ నన్ను పొగడినాడు. కారణ మేమిటంటే, అతని కింగ్లీషు ముక్క రాదు. నేను నాలుగో ఫారంలో ఉన్నానంటే అదేదో గొప్పచదువుక్రింద గణించి, గాభరాపడ్డాడు. అతని పేరు కైలాసపతి (స్థాణువు-అంటే, మొద్దు); మా వదినె చండి; జత బాగా కుదిరింది. 'తగినట్లు కూర్చిరా తా కట్ల బ్రహ్మ'-అనుకున్నా రక్కడివాళ్లంతా.

పెండ్లిలో మాకు జ్యోతిష్కుడు పెట్టిన పేర్లలోగూడా ఒక ప్రత్యేకత:-నాగమణీ, శేషశాయీ. అగ్నిసాక్షిగా రోహిణీ చంద్రులవలె పత్నీపతులమై, ప్రణయైకబద్ధులమై, ప్రపంచం జరిగినన్నాళ్లూ (పరలోకాల సంగతివచ్చినా నేను విశ్వసించను గనుక) ఉంటామని ప్రమాణాలు చేసినాము. మా కీర్తి లక్ష్మీనారాయణులూ, పార్వతీపరమేశ్వరులూ, సుభద్రార్జునులూ, మొదలైన ఆదర్శదంపతుల పట్టికలో అగ్రస్థానాన్ని వహిస్తుందని భావించి, విశ్వసించినాము.

ఒకనాటి కనుచీకటివేళ, యిద్దఱం మిద్దెమీది కెక్కి, యెవ్వరూ లేరనుకొని, హృదయాలు విప్పుకున్నాము. "మీకోసం నేనూ, నాకోసం మీరూ సృష్టింపబడినాము" అని ఒకేమాటలో తన అభిప్రాయాన్ని వెల్లడించింది నాగమణి. అంత చిన్నవయసులోనే, యెంత పాండిత్యం సేకరించిందా, అని ఆశ్చర్యపడ్డాను. చాటున ఉండి యీ మాటలు వింటూన్న పెద్ద లెవరో బిగ్గఱగా నవ్వినారు. మేము వెంటనే సిగ్గుపడుతూ, క్రిందికి దిగిపోయినాము. కాని, నా హృదయంలో ఆ బంగారు పలుకు లట్లనే అచ్చుపడినాయి. అటువంటి దాంపత్యంముందు, సన్యాసమూ, బ్రహ్మచర్యమూ తుచ్ఛంగా తోచినాయి.

## 3

మా ఊరికి రాగానే మళ్లీ వాదానికారంభమయింది. "నళినీదళగత జలకణంగా నటిస్తూ, జనకమహారాజు మోస్తరుగా సంసారంలో సంచరిస్తాను. మీ కేం తెలుసు? ఆదిశక్తి అంశతోనే ఆడవాళ్లు పుట్టినారు. శక్తి లేకుంటే మనమీలోకంలో యెందుకైనా పనికొస్తామా? సత్యం విచారిస్తే, సన్యాసం వట్టి కపటం; బ్రహ్మచర్యం పనికిమాలినపని; అస్వాభావికమూ, అనవసరమూ, అసాధ్యమూ, నీరసమూ, నిర్లక్ష్యభాజనమూఅయిన ఆ రెండాశ్రమాలూ నామకార్థంగా గ్రంథాల్లో కనబడతాయి. అనుభవంలో కనబడవు. అందుకోసమే సమయానుకూల సంఘటనలకు ప్రతిబింబాలైన నాటకాల్లోనూ, సినిమాల్లోనూ శృంగారం వెల్లివిరిసింది. 'ప్రణయం దేవుడు; దేవుడే

ప్రణయం' మన్నమాట మీరు వినలేదూ? 'షెల్లీ' యేమన్నాడు? 'ప్రకృతిలో అన్నీ జంటలేతప్ప, యితరం లేదు; పోవోయ్!'-అన్నాడు. మన కాళిదాసుమాత్రం మూరకున్నాడా?-నీళ్లకు పాచిఉండి తీరవలసిందేనని ఖండితంగా సిద్ధాంతం చేసినాడు. వాళ్ల ముందు మన మేపాటివాళ్లం?"-అని అనేక విధాలుగా నచ్చజెప్పి నా లోటు దిద్దుకున్నాను; కాదు-ఆదర్శం నిలుపుకున్నాను.

తరువాత మూడుమాసాలకే వేసవికాలపు సెలవులొస్తే, వీలు చిక్కించుకొని, అత్తగారింటికి ప్రయాణం కట్టినాను. అది పల్లెటూరు గనుక, అక్కడ దొరకని తినుబండారాలు కొన్ని మూటగట్టి తీసుకొని వెళ్ళడంవల్ల, ముఖ్యంగా పిల్లలందఱికీ నేను దేవుడనై కనబడినాను. పదేండ్ల యీడుగల మా వదినెతో సరసాలాడుతూ, భార్యకు పతివ్రతా ధర్మాలు బోధిస్తూ కాలం గడిపినాను. మా వదినె పొడుగరి అని మొదటనే చెప్పినాను. ఆ సంగతి సాధారంగా మనసులో ఉంచుకొని, "అబ్బో! నిన్ను ముద్దాడడానికి నిచ్చెన తెచ్చుకోవాలి!"-అన్నాను. ఆ దెబ్బతో అమాయకురాలైన ఆ బాలిక చిత్తం డోలాయమానమయింది. ఉన్నట్టుండి కన్నీరుకారుస్తూ, జాలిగా నావంక చూచింది. నేనూ పొడుగే!-తటాలున నవ్వి, దగ్గఱకొచ్చి, నా ప్రక్కను నిలిచింది. "ఏదీ? నే నెంత పొడుగైనా నీ భుజాలక్రిందకే!"-అంటూ బుగ్గలు పొడిచింది.

ఇదంతా యితరు లెవ్వరూ యెదుట లేనప్పుడే. బాల్య యౌవనాల మధ్యకాలంలో జరిగే భావకల్లోలాలు మహాకవులే వర్ణించలేక పోతారు. పవిత్రతా, అపవిత్రతా మెదడులో చేసే యుద్ధాల పరిణామాలు నానావిధాలు. సమయసందర్భాలను బట్టి జయాపజయాలు భేదిస్తాయి. ఆ దశలోని పునాది, అనంతర జీవితసౌధానికాధారం. ఐతే, నా పాలిట బడింది పునాదో, సమాధో మీరే నిర్ణయించండి!-అప్పటి చాటుమాటున సరసాలాడే అలవాటు, నన్నిప్పటికీ వదలనంటుంది.

రెండేండ్లపాటు జీవితం ఒడిదుడుకులు లేకుండా నడిచింది. వేసవికాలపు సెలవులత్తగారింట్లో, మిగిలిన కాలమంతా పాఠశాలలో వ్యయించినాను. యస్. యస్. యల్. సి. పరీక్షలకు ముందు కొన్ని నెలలు, నా మనసంతా గందరగోళంలో పడింది. ఒకవంక సహాయనిరాకరణోద్యమం నన్నాకర్షించింది. ఇంకోవంక ప్రణయవికారం కొలుపట్టి లాగింది. ఏ స్త్రీని చూచినా, యెక్కడెక్కడో చూపులు దొంగతనంగా తిరిగేవి. ఏ గ్రంథం చదివినా, స్త్రీ వర్ణనకోసం పుటలు త్రిప్పబడేవి. ఇందుకు ఫలితంగా పాఠ్యపుస్తకాల కోపానికి పాత్రుడను కావలసి వచ్చింది. తుదకు, పరీక్షాఫలితం పల్టీ కొట్టింది. అంతటితో విద్యాభ్యాసం ఆభాసమయింది.

"ఈ యింగ్లీషు చదువు కున్న రోగమే యిదీ. ఛీ! ఇది మన దేశాని కెంతమాత్రం పనికిరాదు. పరీక్షలతో అవసరంలేని మన చదువువంటి సలక్షణమైన చదువు ప్రపంచంలో లేదు. ఇప్పటినుంచీ దాన్ని సాధిస్తాను. ఇల్లే పాఠశాల చేస్తాను. ఇష్టంలేని విద్య నా కెందుకూ?" అని నా వలెనే అవస్థపడుతున్న స్నేహితు లందఱికూ ఉత్సాహజనకంగా ఉపన్యసించినాను. దేశోద్ధారక దృష్టి సూచించినాను. లోలోపల కలిగే నిరుత్సాహాన్ని, అధైర్యాన్ని మ్రింగి, అన్యులయెదుట గంభీరంగా ప్రవర్తించినాను. నా ఉద్దేశాన్ని విపులీకరించి నాలుగు సమాసా లుపయోగించి, నవ్యపద్ధతిలో ఒక గ్రంథమే వ్రాసి, "విద్యార్థి సమస్యా పరిష్కారిణి" - అని పేరుపెట్టి ప్రకటించినాను.

"పరీక్ష లెందుకు?" - అనే శీర్షిక క్రింద వాటిమీద నా కున్న కోపమంతా తీర్చుకున్నాను. "నాలుగు వేదాలూ చిక్కులు తీసి, నానా పురాణాలూ వ్రాసి, నాటికీ నేటికీ ప్రసిద్ధుడైన వేదవ్యాసు డే పరీక్ష ప్యాసైనాడు? ఆదికావ్యమైన రామాయణం, రాముడు పుట్టకముందే వ్రాసిపెట్టిన వాల్మీకి, యే కళాశాలలో పఠించినాడు? ఉత్తమోత్తమ కావ్యనాటకకర్తయై, ఉన్న భాష లన్నిటిలోనూ అనువాదాలు పెంపొందడానికి హేతుభూతుడై, స్వదేశీ విదేశీయ సరసజ్ఞులచేత సంతోష నాట్యాలు చేయించగలిగిన కాళిదా సెక్కడ 'స్కాలర్ షిప్' సంపాయించినాడు? అవతార పురుషుడైన శ్రీకృష్ణుడు 'గ్రాడ్యుయేటు' కాగలిగినాడా? బుద్ధుడు పాఠశాలముఖమైనా చూచినాడా?-" ఈవిధమైన ప్రశ్నల వర్షంతో కావలసినన్ని కాగితాలు నింపినాను. అనువైన గ్రంథాలయాలన్ని గాలించి, అనుకూల గ్రంథాలు సేకరించి, అమోఘమైన నా ప్రయత్నాన్ని కొనసాగించి, విజయభేరి మ్రోగించినాను.

ఈ విపరీతసృష్టిచాతుర్యం చూచి, నా సహాధ్యాయులంతా దిగ్భ్రాంతులైనారు. పండితులూ పామరులూ పలువిధాల ప్రశంసించినారు. కాని, మావాళ్లుమాత్రం చెడిపోతున్నావని సడదిటుతూ, వీపున మెటికలు విఱిచినారు.

## 4

"బోధించేవాడు సాధించలేడు!"-అన్నట్టుగా నా ఉద్యమం, "ఆదిలోనే హంసపాదు" వేసింది. నాగమణి కాపురానికొచ్చింది. కొంత స్థిమితపడ్డట్టయిందిగదా అని సంతోషిస్తుంటే, యేటా ఒక కాన్పు!-మూడోసారి ప్రసవించి, ముద్దరాలు మంచం పట్టింది. విషమవ్యాధి నూదివలెవచ్చి దబ్బనమై తేలింది. నా ప్రయత్నాలన్నీ విఫలాలైనాయి. జీవిత స్వప్నసామ్రాజ్యంలోని నవరత్నఖచిత సింహాసనం క్రుంగిపోయే కాలం దాపురించింది. నా యింటిదీపం-నా హృదయజ్యోతి-నా ప్రణయసర్వస్వం-అదృష్టదేవత-అంతరించే అవస్థలో ఉంది. నాలో అంతవఱకూ గూడుకట్టుకొని కాపురమున్న లఘుప్రకృతి అనే పిట్ట హఠాత్తుగా యెగిరిపోయింది. ఎక్కడలేని ఓపిక తెచ్చుకొని, రాత్రింబగళ్లు నాగమణి శయ్యప్రక్కనే ఉండి, యిష్టదేవతను ప్రార్థించసాగినాను. నా జీవితంలో యెన్నడూ నే నింత హృదయపూర్వకంగా యేపనీ చేసినవాడను కాను.

"తల్లీ! జగదంబా! నీ విచ్చిన వరాన్నే నీవు ప్రతిసంహరించడం న్యాయం కాదు. నాప్రణయరాసిని బ్రతికించు! నాసంసారం అంధకారబంధురం చేయకు! నా లోపాలేవైనా ఉంటే క్షమించు! కాదంటివా? నన్ను నీ యిష్టానుసారం శిక్షించు!-నా నాగమణి మాత్రం నష్టపఱచకు! నాకు గల నిరంతర నిష్కల్మష ప్రేమకు నీవే సాక్షి. నేను మహాపరాధి నే. పరమపాపి నే. ఒప్పుకుంటాను. నీవు దయామయివే? పతిపావనివే? నీ కోపం నావంటి అల్పమైన పురుగుమీదనా ప్రయోగిస్తావు? వద్దు, తల్లీ! వద్దు!-నీకు శతసహస్ర సాష్టాంగ నమస్కారాలు."—

నా ప్రార్థన నా మొహాన్నే కొట్టి, పాడు విధి తనపని తాను చేసింది. నా నాగమణిని దొంగిలించి మృత్యుదేవత తన కిరీటంలో ముడుచుకుంది. కష్టమాత్రం నా యెదుట!-నేను మాస్తూ కూర్చున్నాను. ఒకవిధమైన వజ్రశాంతి నన్నావేశించింది. కడుపునిండా దుఃఖం-కన్నీరు వెలువడక, లోపలనే యింకిపోయింది. నోట మాట రావడంలేదు. స్తబ్ధత్వం హెచ్చింది. నా ప్రాణం నాలో లేనట్టు తోచింది. ఆశిరస్సు దగ్గఱినీమ నూనెదీపం నన్నూరక వెక్కిరించింది. నా మెదడెక్కడెక్కడనో సంచరించింది. "నే నెవరు? నాగమణి యెవతె? నా కంటికి కనబడకుండా ఆ

శరీరాన్ని వదలిపెట్టిపోయిన పదార్థం యేయే పరిణామాలు పొందుతుంది? నేను ప్రేమించేది ఆ పదార్థాన్నా? ఈకట్టెనా? ఒకనాడు నాకట్టెకూ యిదేగతి పడుతుంది. అప్పుడు నే నేమౌతాను?"—ఈ ప్రశ్నలకు సమాధానాలు వెదకేకొద్దీ, విశ్వమంతా అంధకారంగానే అగపడింది.

బిగ్గరగా నే నేడ్వలేదని, వింతపడినారు కొందరు బంధువులు. చూడడానికొచ్చిన పెద్దలందరూ రాని కన్నీళ్లు తెచ్చుకున్నారు. వాళ్ళంతా మానవుల్లో జమ. నేను మృగాన్ని కనుక, యింత బాగా దుఃఖాన్ని ప్రదర్శించే యోగ్యత కలుగక పోయినది. లోలోపల కుళ్లిపోవడమే నా అలవాటు. శోకభారం అనుభవించడానికా, ప్రదర్శించడానికా?—మీరే చెప్పండి!

శ్మశానయాత్ర సాగేముందు, పూలూ, కుంకుమా మొదలైన పరిమళద్రవ్యాలు నాగమణిశరీరాన్ని తమలో దాచుకోడానికి తయారైనాయి. నేను నడుస్తుంటే జగమంతా చక్రమై తిరిగింది. సూర్యబింబం భూతమై బెదిరించింది. హృదయకోణం దాకా గొడ్డలిపెట్టు పెట్టి, కొమ్మను ఖండిస్తే వృక్షమే విధంగా విహ్వలిస్తుందో, ఆ విధంగా విహ్వలించినాను. ఆకాశం పరిహసించింది. అగ్ని, రాజకుండానే నాలో మండి, ఆపాదమస్తకం కాల్చినట్టయింది. జరగవలసిందంతా జరిగిపోయింది.

## 5

హృదయమనేది లేశమైనా లేని కొందరు బంధువులప్పుడే నా ద్వితీయ వివాహానికి పెత్తనాలు సాగించారు. మానవుల్లో యిది మామూలన్నారు. "పోయినవాళ్ళతో మనమూ పోతామా? నొసటిగీతెవ్వరూ తప్పించలేరు. ఎన్నాళ్లని యీ విధంగా ఉంటావు? నీవింకా యువకుడవు. నిన్నా మొన్న కళ్లు తెరిచినావు. మా కండ్లముందరే పుట్టినావు. ఇరవై అయిదేండ్లకే యేమైనట్టు? ఇంకో పెండ్లి చేసుకో! ఈ పిల్లల నెవరు పోషిస్తారనుకున్నావు? నీవు గనుక 'ఊఁ—' అంటే నేడే సంబంధం తెస్తాము"—అని ఉపదేశించినారు.

నాకు పచ్చిపుండుమీద పచ్చిమిరపకాయలు నూరినట్టయింది. "సన్న్యాస మనుకున్న రోజులు సాగినాయి; బ్రహ్మచర్యమన్న రోజులు పాడైనాయి; దేశసేవ దిబ్బలో కలిసింది. కడకు నాగతి, 'ఆదర్శపతి', అనిపించుకోడానికైనా లేకపోవడమా? పరిణయకాలంలో చేసిన ప్రమాణాలన్నీ యే గంగలో కలిసినాయి? సర్వదేవతలూ, సర్వఋషులూ, సర్వతీర్థాలూ, సర్వభూతాలూ సాక్షులుగా, 'నాతిచరామి', అని నోరార పలికినానే? ఆ పలుకులన్నీ చిలుకపలుకులేనా? అర్థం చేసుకోగలిగితే, వ్యభిచారంకంటే ద్వితీయవివాహం దోషమనిపించదూ? మనదేశంలో స్త్రీలుమాత్రం తమ ధర్మాన్ని పరిపాలిస్తారు. మనం వాళ్లకే ద్రోహం తలుస్తాము. క్షుద్రజీవికలే మానవసాంప్రదాయాలా? చెప్పేదొకటీ, చేసేది వేఱొకటా? జపించేవి స్వర్గ, వైకుంఠ, కైలాసాలా? సంచరించేవి అధః పాతాళాలా? భూలోకంలోనైనా వీళ్లు నిలవడానికి తగరే? వీళ్ళకొక నాలుక లేనేలేదే?—ఛీ! నాకీ మానవుల జోలే వద్దు. మృగంగా ఉన్నా కొంత మేలు."—అని నిశ్చయించుకున్నాను.

* * *

మూడు కొన్నాళ్లైనప్పటికీ, మిగిలిన బిడ్డ ఒకడే. వాడి పోషణ కూడా కాలక్రమేణా కష్టసాధ్యమయింది. 'ఆడుదానిచేతి అర్థం, మగవానిచేతి బిడ్డా'—అనే సామెతలోని ఆఖరుభాగం నాయందు బాగా అన్వయించింది. నా మెదడు మొదటికి వచ్చింది. తర్కవితర్కాల పోరాటంలో తండనాలాడుతూ కొన్నాళ్లు గడిపినాను. నాగమణి మరణంనాటి ఉద్రేకమంతా సన్నగిలి, నాలో నిద్రపోతున్న నిజస్వభావం చిగురింప సాగింది. "జీవితంలో యిటువంటి కఠినవ్రతం చిత్తభ్రాంతి కాకుంటే యేముంది? నా ఊహలే ధర్మమార్గసోపానాలైతే, నానాటికీ మనసులో యీ తుములయుద్ధ మెందుకూ? ఊళ్ళో ఉండవలసిన ప్రాణి అడవిలో కూర్చుంటే, నీళ్లలో ఉండదగిన చేప నేలమీద సంచరించదూ? ఇందుకు ఫలితం ఆత్మహత్యే తప్ప యింకేమిటి? అస్వాభావికమైనదే అధర్మం. ఐతే, ఉగ్రమైన యింద్రియనిగ్రహంతో కాముడు రాముడు కావడంలేదూ?"—

* * *

మరి కొంతకాలం జరిగేటప్పటికి, మళ్లీ పెళ్ళే మంచిదని తోచింది. "కాని, యీసారి మామూలు పెళ్లి పనికిరాదు. దేశంలో వీరేశలింగం పంతులుగారి ధర్మమా అని వితంతువు లెందరో వివాహాలకు తయారౌతున్నారు. వాళ్లలో ఒక సరిక్రొత్త వితంతువును వరిస్తాను. సంసారం పూర్తిగా జయిస్తాను. ఇంతకుముందు కలిగిన అపజయాలన్నిటిని రాబోయ్యే విజయానికి మెట్లుగా భావిస్తాను."—అని ఆకాశంలో మేడలు కట్టినాను.

ఇంతలో పురాణయుగం మారి, అధునాతన యుగం ఆరంభమయినందుకు సూచనగా, శారదాబిల్లు అమలులోకొచ్చింది. ఎదిగినపిల్ల లేయింట్లో చూచినా యెక్కువైనారు. "వీళ్లకే వరులు దొరకడం గగనమైతే, వితంతువులగో డెవరు విచారిస్తారు? కావలసినంత ఆస్తితోగూడా అమ్మాయిలను, కోడిపిల్లలను గ్రద్దలు మోస్తరుగా తన్నుకొని రావచ్చు. ఆ శారదాగాడు నాకోసమే పుట్టినట్టున్నాడు. బలే యెత్తు వేసినాడు! ఎందులో దిగినా నాకష్టం లేదుగద?" అని కూడా అప్పుడప్పుడూ ఉబలాట పడినాను.

వితంతుశరణాలయాలకు ఉత్తరాలు వ్రాసి, జవాబులకోసం యెదురు చూచినాను. ఏమీ ప్రయోజనం లేకపోయింది. వాళ్లడిగే ప్రశ్నలన్నీ అన్నీ కావు. ఖూనీకేసుల్లో ముద్దాయిలను క్రాసు చేసేపోలీసులైనా కొంత మేలనిపిస్తారు. "స్వయంగా ఒక చక్కరు కొడదామా?—అక్కడి రహస్యాలన్నీ తెలుస్తాయి. ప్రత్యక్షం వేఱూ, పరోక్షం వేఱూనూ." అనుకొని బయలుదేరినాను.

## 6

తంతువు తెగిన గాలిపటానికొక ఊరేమిటి? నిరుద్యోగికి నియమమేమిటి? రాయలసీమ విడిచి ఒక్కసారిగా రాజమహేంద్రవరం దిగినాను. భాషలో అంతరం; భావాల్లో అంతరం; అలవాట్లలో అంతరం; ఆకారాల్లో అంతరం;—ఆడవాళ్లలో గూడా అంతరమే!—మా సీమలో శృంగారవతులకు సారస్యప్రధానమైనవి రెండూ సామాన్యాలు; అక్కడ అసామాన్యాలు. ఆనకట లేని తుంగభద్రా తీరపు తిన్నెలకూ, అఖండగోదావరీ డెల్టాలకూ యెక్కడి కెక్కడ? నిమ్మ మొదలు దానిమ్మ, లేదా నారింజ మొదలు నారికేళం-ఇంతకంటే యెక్కువ మా సీమలో అరుదు. అక్కడనో? బత్తాయి మొదలు పనసవలకూ పంచారించినాయి. చూడడానికి రెండు కండ్లూ చాలవేమో?

వితంతుశరణాలయంలో విగతతంతువులూ, విపరీతతంతువులూ; వినోద, విశ్రాంత, విజృంభిత, విభ్రమ, విక్రమాది

(29-వ పేజీ చూడండి)

**కుష్ఠు ★ బొల్లి**

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటి చికిత్స, క్యాటలాగు ఉచితం. జి. వి. రెడ్డి అండ్ కో., (రిజిష్టర్డు) "భాస్కరాశ్రమము" గోపాలపురం, తూ. గోదావరి.

# మా యిల్లు మ్యూజియం నేను మృగాన్ని

(15-వ పేజీ తరువాయి)

వివిధపరిణామ విశ్వసర్వస్వమంతా ప్రత్యక్షమంటే చాలదూ? "ఈ వకారగుడులన్నీ వాస్తవంగా ఉద్ధరించదగినవే!"-అని మన ఊహ; మనలనే ఉద్ధరించడాని కవతరించిన అపరశక్తులమని వాళ్ళ ఊహ. ఉభయత్రా స్థిరపడిన యీ రైలుపట్టాలు కలుసుకునే దెప్పుడు?

నేను నా శక్తియుక్తులన్నీ ఉపయోగించి శరణాలయాధికారులతో శత పోరినాను. వాళ్ల చరిత్ర వ్రాస్తాననీ, 'వకారగుడి వైభవ' మనేపేరు పెడతాననీ, యేమేమో వాగినాను. నే నెవతెను అభిలషిస్తానో ఆమె నన్నంగీకరించదు; వచ్చి కోరే నారీమణిమీద నాకు బుద్ధిపుట్టదు. ఈ విధంగా చూచిచూచి, తుదకు విసిగి, వెనుకకు మళ్లినాను.

తరువాత గుంటూరు శారదానికేతనం నడిపే పుణ్యదంపతులను జన్మపావనంగా దర్శించి, నా కథ చెప్పుకున్నాను. 'ఎక్కడా గతిలేనివాళ్లకే యీ సంస్థార' మన్నట్టు వ్యంగ్యంగా వారభిప్రాయ సూచన చేసినారు.

తిరిగితిరిగి మద్రాసు చేరినాను. అక్కడ నా స్నేహితు డొకడు సంధిల్లినాడు. అతడన్నాడుగదా! "నీవు కులం వదలినావు; జాతి వదలినావు; మతం వదలినావు; ధర్మం వదలినావు; అభిమాన మెందుకు వదలవూ? నాకు తెలిసి, ఒకానొక ఊళ్లో, ఒక అనాఘ్రాతపుష్పం ఉంది. నిన్ను చూస్తే తప్పక అంగీకరిస్తుంది. ఐతే, నీవు నడుము పుట్టియుంచగూడదు. ఆమె కళావంతుల తెగకు చేరింది. నీకు భూసురత్వం చెడుతుంది. ఒప్పుకుంటావా?"

ఆలోచించి ఆఖరుకు సరే నన్నాను. ఇద్దఱం ఆ రాత్రే రైలెక్కి తెల్లవారు జామున ఆ ఊళ్లో దిగినాము. ఇదీ ఒక విధమైన సంస్కారమే కదా? - అని సంతోషించినాను. అతడు చెప్పినట్టే అన్ని లక్షణాలూ సరిపోయినాయి. ఆదర్శ సంస్కర్తనైనాను. ఇంక వివాహం మాత్ర మెందుకూ? పనికిమాలిన మంత్రాలూ, ప్రాణసంకటాలైన ప్రమాణాలూ, ప్రాచీన సాంప్రదాయాలూ - అన్నిటికీ స్వస్తిచెప్పి అనంత స్వాతంత్ర్య మార్గాన్ని అవలంబించినాను. మన్మథుడే మా యిదఱనూ కూర్చినాడు. విద్యుద్దీపాల సువర్ణశోభలో అలౌకికమైన పద్మావతీప్రతిమ! - అన్నిటా పేరు సార్థకమయింది. కంఠకు మిఱుమిట్లు గొలిపే ఆ రూపం చూచేకొద్దీ నా కొక విధమైన క్రొత్తరుచి పుట్టింది. ముందుకు వంగి ముద్దాడబోతుంటే, అంతర్వాణి ప్రబోధించింది. హఠాత్తుగా భీతి! - ఆందోళన! - జీవిత విప్లవం! - నేను తటాలున వెనుకకు తగ్గవలసి వచ్చింది.

"నీవు ద్రోహివి; దురాచారివి; నాస్తికుడవు; పరమపాషాణ పతితహృదయుడవు; నమ్మినందుకు నన్ను నాశనం చేస్తావా? జాగ్రత!"-అని పండ్లు పటపట కొఱుకుతూ ఉఱిమిచూచే ఉద్దండశక్తి నాముందు ప్రత్యక్షమయింది. ఆ వాణి వీనుల్లో విస్పష్టంగా మ్రోగింది. ఒక్కసారిగా కండ్లకూ చెవులకూ కలిగిన బీభత్సంవల్ల బిత్తరపోయినాను. తేలమొహం వేసి దిక్కులు చూచినాను. అంతటా, అదే విశ్వరూపదర్శనం-హఠాత్తుగా మూర్ఛపోయినాను.

స్మృతి కలిగేప్పటికి, నేను నిజమైన మృగాన్ని. కాకుంటే, చిత్రంగా నా చుట్టూ మూగి, జన మెందుకు గోలచేస్తారు? నెమలి పింఛపు విసనకఱ్ఱవలె నా ప్రక్కను నిలిచిఉన్న పద్మావతి గాథరా యెందుకు ప్రకటిస్తుంది? నే నెందుకో నిర్విణ్ణపడినాను. ఆద్యంతాలు జ్ఞాపకం చేసుకుంటూ ఆ సుడిగుండంలోనుండి తప్పించుకోడానికి మార్గం వెదకినాను. తటాలున లేచి, తల వంచుకొని, వీధిలోనికి వెళ్లి, "మీ రంతా యెవరు? నేను మృగాన్ని దారి వదలండి!"- అని వెఱ్ఱిగా గర్జించినాను. కొందఱు భీతిపడినారు; కొందఱు నవ్వినారు; మఱికొందఱు, "వీ డెవడో పిచ్చివాడురా!"-అని గుసగుస లాడినారు.

★

"చిన్నవదినా నీవానాడు శారదతో, నడవలేకపోతే మోటారు కొనమను' అన్నావు. నీనోటవాక్యం ఫలించింది. నీకు నమస్కారం. పెద్దవదినా మీరీ మారు బొంబాయివస్తే మా శారద నౌకర్లు మీకు అన్నీ సిద్ధంగా అమరుస్తారు. తప్పకరండి. అని చెప్పి అందరికీ నమస్కారం చేశేను. ఇద్దరు వదినగార్లు ఏమీ జవాబు చెప్పలేక సిగ్గుతో తలలు వంచేసుకున్నారు. తల్లి దండ్రిమాత్రం అప్పుడప్పుడు క్షేమసమాచారం తెల్పుతూవుండండి అనిగద్గదికకంఠంతో అన్నారు. తల్లి కుమారుని వదలవలసి వచ్చిందని కంట నీరు పెట్టుకుంది. ఎంతయినా కన్నప్రాణం కదా! "ఉద్యోగం పురుషలక్షణం అనివాడు సుఖంగా వుద్యోగంచేస్తూ కాపురం పెట్టుకుందుకు వెళ్లుతూంటే కంట నీ రెందుకే వెఱ్ఱిదానా" అని వెంకప్పావుధాన్లు భార్యతో అన్నాడు. శారద అందరకూ నమస్కరించి మోటారెక్కి ముందు సీటులో కూర్చుంది. నౌకరు వచ్చి కారు తలుపు మూసేశు. డ్రైవరు సీటులో గంగాధరం కూర్చుని కారు స్టార్టు చేసేశు.

★

## విన్నారా?

* యుద్ధానంతరం అమెరికన్ యుద్ధనౌకలకు అమెరికన్ కాంగ్రెసు చాలా తక్కువ ధరలు నిర్ణయించి విక్రయించడంవల్ల జోసఫ్ కెనెడీ, అడ్మిరల్ హాల్సే, ఎడ్వర్డ్ స్టెటినియస్‌లు లక్ష డాలర్ల పెట్టుబడితో 28 లక్షలు లాభం సంపాదించారు.

* ఫోర్ట్‌వర్త్, టెక్సస్, లెక్సింగ్టన్ రాష్ట్రాలలోని ఆస్పత్రులు నాలుగేళ్లక్రిత 26 మంది యువకులను, మాదద్రవ్యాలకు అలవాటుపడ్డవారిని వేర్పుకున్నాయి. ఇట్టివారి సంఖ్య ఇప్పుడు 700కు పెరిగింది.

* బార్సిలోనా(స్పెయిన్)లో ఇటీవల జరిగిన సమ్మెలూ, ఫ్రాంకో వ్యతిరేక ప్రదర్శనాలూ చూసి పశ్చిమరాజ్యాల నౌకా, విమాన స్థావరంగా స్పెయినును వినియోగించేవిషయమై అమెరికను సైనికశాఖాధికారులు నిరుత్సాహం చెందుతున్నారు.

* నిరుద్యోగంతో బాధపడుతున్న ఒక జపానీవాడు, 50 వేల యెన్‌లు ఇచ్చినవారికి యావజ్జీవ దాస్యం చేస్తాననీ, లేనిపక్షాన తన భార్యనూ, నలుగురు బిడ్డలనూ చంపి తానూ చస్తాననీ "యొమియురీ" అనే టోక్యో దినపత్రికలో ప్రకటన వేశాడు. ఆ పత్రిక ఈప్రకటనను ఉచితంగా వేసింది.

* 1945 ఆగస్టు 6 న హిరోషిమానగరం మీద మొదటి అణువుబాంబు పడ్డచోట 30 అడుగుల ఎత్తుగల స్తంభం కట్టి దానిపైన 90 పౌనుల బరువుగల "శాంతి గంట"ను హిరోషిమా పౌరులు - అణువుబాంబునుండి తప్పించుకున్నవారు - ఏర్పాటుచేశారు. ఇటీవల ఈ గంటను ఎవరో దొంగిలించారు. హిరోషిమా పురపాలకులు దొంగకు "సిగ్గు లేదు," అని ప్రకటించారు.